RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక





సంపుటి : 12 సంచిక : 325 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 28 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# రుణమాఫీపై సర్కారు కసరత్తు

## గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు


## బ్యాంకులతో ఇప్పటికే చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే బ్యాంకులతో దీనిపై చర్చించారు.

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ రుణమాఫీ చేసేందుకు రకరకాల కొర్రీలు పెట్టిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించిందని ధ్వజమెత్తింది. మరోవైపు అయిదేళ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం.. చివరకు కేవలం 23 లక్షల మంది రైతులకే రుణ మాఫీ చేసినట్టుగా అధికారులు లెక్కలు తేల్చినట్టు సమాచారం. దాదాపు 14 లక్షల మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఎగవేసినట్టుగా లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు జరగకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసే ప్రతిపాదనలపై మొదటి వంద రోజుల్లోనే కసరత్తు మొదలు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

# కార్పొరేషన్ ఛైర్మన్ల రెండో జాబితాపై కాంగ్రెస్ సర్కార్ కసరత్తు - ఈసారి 17 మందికి ఛాన్స్!



రాష్ట్రంలో ఇప్పటికే 37 కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి... ఎన్నికల కోడ్ ముగియగానే మరో 17 కార్పొరేషన్ల ఛైర్మన్లను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నారు. మొదటి జాబితా, రెండు జాబితాలో కలిపి మొత్తం 54 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. రాష్ట్ర కార్పొరేషన్ పదవుల్లో సీఎం రేవంత్ రెడ్డి అదృష్ట సంఖ్య 9 కలిసి వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. ఛైర్మన్లుగా నియమితులైన వారంతా ఒకేసారి బాధ్యతలు తీసుకోనున్నట్టు సమాచారం. వచ్చే నెల మొదటి వారంలో వీరందరికీ అధికారికంగా జీవోలు అందనున్నాయి. ఈ మేరకు రెండో జాబితాలో ఛైర్మన్లుగా చేర్చబోయే పేర్లపై పీసీసీ చీఫ్ కసరత్తు చేస్తునట్టు తెలిసింది. కుల సమీకరణాలు, సీనియారిటీ, పార్టీలో కష్టపడిన నేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

**మరో 17 కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకానికి కసరత్తు :** ఇప్పటికే ప్రకటించిన మొదటి జాబితాలో.....గాంధీ భవన్ కేంద్రంగా పని చేసిన వివిధ పార్టీ విభాగాల ఛైర్మన్లను ప్రభుత్వ రంగ కార్పొరేషన్ల ఛైర్మన్లుగా నియమించారు. కొందరు జిల్లా స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన కీలక నేతలకు కూడా మొదటి జాబితాలో అవకాశం లభించింది. ఇప్పుడు కూడా ఇదే విధానాన్ని అవలంభిస్తూ క్యాస్ట్ ఈక్వేషన్స్ కూడా పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించనున్నట్లు గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి. ఈసారి ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల నేతలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. ఇక మొదటి జాబితిలో అవకాశం దక్కని పార్టీ అనుబంధ సంఘాలకు, సెకండ్ లిస్ట్ లో ప్రాతినిధ్యం కల్పించనున్నారు. కాగా కార్పొరేషన్లలో అత్యధికంగా యువ నాయకులకే ఇవ్వాలని సీఎం రేవంత్ భావిస్తున్నారట.

**అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి ఛాన్స్? :** నామినేట్ పదవుల్లో ఈసారి పార్టీ జిల్లా అధ్యక్షులకు సైతం అవకాశం ఉంటుందనే చర్చ గత కొద్ది రోజులుగా గాంధీ భవన్ లో జోరుగా సాగుతుంది. రాష్ట్రంలోని పలు జిల్లా అధ్యక్షులు కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారని, వాళ్లల్లో పార్టీ కోసం కష్టపడిన నేతలకు రెండో జాబితాలో అవకాశం ఉండొచ్చు అని చర్చ జరుగుతుంది. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన పలువురు నేతలకు కూడా కార్పొరేషన్ పదవులు కట్టబెట్టే ఆలోచనలో సీఎం ఉన్నారట. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కించుకొని ఓడిపోయిన నేతలకు మాత్రం కార్పొరేషన్ పదవులు మాత్రం ఇవ్వలేం అని సీఎం తేల్చి చెప్పారట. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన పలువురు నేతలు తమకు ఛైర్మన్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ ను కోరగా....పార్టీ విధివిధానాలను బ్రేక్ చేసే పరిస్థితి లేదని సీఎం స్పష్టం చేశారట.

**రానున్న ఎన్నికలను కూడా దృష్టిలో పెట్టుకొని :** త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. పదేళ్ల తర్వాత పవర్ లోకి వచ్చిన కాంగ్రెస్...మెజారిటీ సర్పంచ్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలవడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో అన్ని జిల్లాలకు నామినేట్ పదవుల్లో సముచిత స్థానాలు కల్పించేందుకు పార్టీ ప్రయత్నిస్తుంది. గత రెండు రోజుల నుంచి మంత్రులు, డీసీసీలు ఆయా జిల్లాల కీలక నేతల వివరాలను గాంధీ భవన్ కు పంపిస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి శ్రమించిన నేతలకు, క్యాస్ట్ ఈక్వేషన్స్ ను టీపీసీసీ స్టేట్ కమిటీకి పంపించారు. 17 కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల కోసం అన్ని జిల్లాల నుంచి దాదాపు వందకు పైగా పేర్లు సీఎం దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. కాగా ఎన్నికల కోడ్ ముగియగానే ఛైర్మన్ల రెండో జాబితా ఖరారు కానుంది.



## అదిరిపోనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు

హైదరాబాద్: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించనున్నారని, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న ఉదయం రాష్ట్ర గీతాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించడంతోపాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

# ఎక్కడో తేడా కొడుతోందే...!?

## 'అబ్ కి బార్ చార్ సౌ పార్'లో ఊపు తగ్గిందా!?

## కాషాయ దళపతుల వ్యాఖ్యల్లో గాంభీర్యం కరువైందా?




## విడతల వారీ పోలింగ్‌పై 'ఇండియా'లో ఆశలు

దేశమంతా ఉత్కంఠగా చూస్తున్న ఈ సార్వత్రిక ఎన్నికల్లో అతి ముఖ్యమైన పరిణామాన్ని గమనిస్తే జూన్ 4న వెలువడే తీర్పు ఏమై ఉంటుందో సులువుగానే అర్థం చేసుకోవచ్చు. 'అబ్ కి బార్ చార్ సౌ పార్' అని ఎలక్షన్లకు మూడు నెలల ముందుగానే ఘనంగా కూతపెట్టిన కాషాయ పార్టీ దళపతులు దేశవ్యాప్తంగా దశలవారీగా ముగుస్తున్న పోలింగ్ సరళితో తమ నినాదాన్ని గంగకు వదిలేశారు. వారి మాటల్లో ఇప్పుడు ఆ గర్వం లేదు. ఆ పార్టీ అనుంగుల్లో ఇప్పుడా చర్చే లేదు. అసలు అధికారమైనా నిలబెట్టుకుంటామా అనే దిశగా వారిలో భయాందోళనలు పెల్లుబుకుతున్నాయి.

**సౌత్‌లో బీజేపీకి చుక్కెదురు :** దక్షిణ భారతంలో ఏం చేసినా బీజేపీ పాచిక పారడం లేదు, మొన్నటివరకూ కొంత ఆశల్ని రేకెత్తించిన కర్నాటకలోనూ వారి బండారం బట్టబయలై ఓటర్లు పొలిమేర ఆవలకి తరిమేశారు. ఏపీ, కేరళ, తమిళనాడు, తెలంగాణలోని దాదాపు 130 స్థానాల్లో కనీస ఆశలు లేవు. ఇక పెద్ద రాష్ట్రాలైన యూపీలోని 80 స్థానాలు, మహారాష్ట్రలోని 48 స్థానాలు, వెస్ట్ బెంగాల్ 42 స్థానాలు, బిహార్ 40 స్థానాలు బీజేపీకి గతంలో బలంగా ఉన్నాయి. అయితే, ఈసారి మాత్రం అక్కడ పూర్తిగా ప్రతికూలంగానే ఉంది. పశ్చిమ బెంగాల్ లాంటి ప్రాంతంలో గెలవడానికి ఎంత చిచ్చుపెడుతున్నా.. పాచిక పారకపోవడం, బిహార్లో నమ్ముకున్న నితీశ్? కొంపముంచనుండటం, యూపీలో ప్రభ మసకబారిపోవడం, మహారాష్ట్రలో శివసేనకు చేసిన ద్రోహం 210 స్థానాల్లో హీనపక్షానికి దిగజార్చబోతున్నాయి. పైగా ప్రజలకు ఏం చేసామో చెప్పడానికిలేక ఉచిత రేషన్ అనే అంశాన్ని పదేపదే చెప్పి వారి ఆత్మాభిమానంపై దెబ్బకొడుతున్నారు. ఏతావాతా వారు నమ్ముకున్న గుజరాత్, మొన్నటి ఫలితాలతో రాజస్థాన్ మినహా పెద్దగా ప్రభావం ఎక్కడా చూపలేదనేది నిష్టూర సత్యం. ఇక పంజాబ్, ఢిల్లీ, హర్యానాల్లో ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ అరెస్ట్ అనేదే వారి ఓటమిని చెప్పకనే చెప్పింది. ఈశాన్య రాష్ట్రాల్లో సైతం మణిపూర్?లో రగిల్చిన కార్చిచ్చు బీజేపీనే దహించబోతుంది. ప్రాంతాలవారీగా ఇంత స్పష్టంగా ఎన్డీయే బలహీనతను చూపిస్తుంటే బీజేపీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది.

**తుఫాన్ ముందు ప్రశాంతత :** కాంగ్రెస్ ప్రచార పర్యవసానమే పోలింగ్ జరుగుతున్న ప్రతి దశలోనూ ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించి, దేశాన్ని రక్షించుకోవడానికి నిర్ణయం తీసుకునేలా ప్రేరేపించాయి. అందుకే ఎన్నికల ముంగిట ప్రతి బీజేపీ వ్యక్తి నోట పలికిన 'అబ్ కి బార్ చార్ సౌ పార్' క్రమంగా కనుమరుగైంది. కాశ్మీర్ అంశం, నాడు భావోద్వేగాలను రెచ్చగొట్టిన సర్జికల్ స్ట్రైక్ ఇప్పుడు లేదు. ఆర్టికల్ 370 రద్దు ఘనత అని దేశమంతటా ఊదరగొట్టిన మోదీ అనుయాయులు చివరకు కాశ్మీర్లో పోటీ చేయలేకపోయారు. ఇలా 2014, 2019లో తమకు అనుకూలంగా ఉన్న ప్రతీది ఇప్పుడు వారికి పెనుభూతమై తరుముతోంది. దేశ నిర్మాణం, దేశ భవిష్యత్ ఆలంబనగా ఎన్నడూ బీజేపీ ఎన్నికల గోదాలోకి రాలేదు. కేవలం భావోద్వేగపరమైన అంశాలతోనే ఇన్నాళ్లు పొద్దుగడుపుతూ వచ్చింది.

కానీ, నేడు అన్ని ధరలు ఆకాశాన్నంటి ప్రజలు అల్లాడుతుంటే... అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పతనమౌతున్నా రోజురోజుకు పెట్రోల్ ధరల మోత మోగుతుంటే దాని పర్యవసానంగా పెరుగుతున్న పప్పు, ఉప్పులు కొనలేక సామాన్యుడు చతికిలపడుతుంటే, దీనికి కారణాలేంటో వారు ఆలోచిస్తున్నారు, అందుకే తుఫాన్ ముందటి ప్రశాంతత కన్పిస్తున్నా జూన్ 4న జన సునామీ వారిని ముంచెత్తి తమ ఆకాంక్షలను నెరవేర్చుకోబోతుంది. అందుకే రాబోయే తీర్పు మార్పు దిశగా నవ చైతన్యం చూపించబోతుంది.

**కనపడని బీజేపీ బెంచ్‌మార్క్ :** అన్నింటికీ మించి పదేండ్లు అధికారంలో ఉండి సైతం ఇదిగో ఇది మా బెంచ్ మార్క్ పని అని కానీ, ప్రజల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన మా ఐకానిక్ పథకం ఇదీ అని కానీ చెప్పుకోవడానికి బీజేపీకి ఒక్కటీ లేదు. వ్యక్తి పూజ నిషేధం అనే సైద్ధాంతిక మూలం కల్గినవారం అని చెప్పుకునే ఆ పార్టీ నేతలు ప్రభుత్వం చేసినపని నిర్దిష్టంగా ఇదని స్పష్టంగా చెప్పుకోలేకపోతున్నారు. చివరికి ఆ పార్టీలో ఇంకెవరూ లేరు అన్నట్టుగా కేవలం మోదీని మాత్రమే ముందుకు నెట్టడం వారి నైరాశ్యానికి పరాకాష్టగానే ప్రజలు చూస్తున్నారు. పార్టీ తరఫున ప్రచార చిత్రాల్లోనూ మోదీ గ్యారెంటీ అనే పసలేని నినాదాన్ని ప్రజలపై రుద్ది, మోదీ దైవాంశ సంభూతుడుగా పేర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా కొంతమంది ఆ పార్టీ నేతలే దేవుడే మోదీ భక్తుడు అనే స్థాయికి దిగజారి పోయారు. నాకెవరూ లేరు. కానీ, నా కీర్తే లోకమంతా చెప్పుకోవాలి అని మోదీ ఆకాంక్ష. ఇద్దరితో మొదలయ్యాం అని చెప్పుకున్నప్పుడు వారికి ప్రధానంగా పనిచేసిన మందిర్, మసీద్ వివాదం నేడు లేకపోవడం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో నిర్మితమైన రామమందిరాన్ని ఎన్నికల కోసం వాడుకోవాలని చేసిన విశ్వప్రయత్నాలు పని చేస్తున్నవి లేవు. చివరికి ప్రాణ ప్రతిష్ఠ కాకుండానే రాముడి అక్షింతలతో యావద్దేశంలో చేసిన ప్రచార యావ సైతం వారికి ప్రతికూల ఫలితాన్నే ఇస్తుందనేది జూన్ 4న స్పష్టం కానుంది. .

**యూపీఏ పాలనలోనే సంక్షేమం :** నాగార్జునసాగర్, బాక్రానంగల్, తెహ్రీ, ఇడుక్కి వంటి భారత నేలల్ని సస్యశ్యామలం చేసిన నిర్మాణాలు, పనికి ఆహార పథకంలాంటి భారత జాతిని సుసంపన్నం చేసిన యూపీఏ హయాంలో అమలైన పథకాలు తప్ప ఇదీ మా గొప్ప అని చెప్పుకోలేకపోవడమే ఎన్డీయే పతనానికి మూల కారణం, దీనికి పైపెచ్చు ప్రైవేటీకరణ పేరుతో జాతిని జాగృతం చేసే యూనివర్సిటీలు మొదలు నవరత్న కంపెనీలను సైతం ప్రైవేటుకు కట్టబెట్టి దేశంలో సింహభాగం ఉన్న దళిత, గిరిజన, బహుజన హక్కుల్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుండడం వారిని అధికారం నుంచి కూకటివేళ్లతో పెకిలించబోతునట్టుగా స్పష్టత రానుంది. అదానీ, అంబానీల సేవలో తరించే ప్రధాని చివరకు వారే కాంగ్రెస్?కు నిధులిస్తున్నారనే ఆరోపణలతో బేలగా మారి పోయారు. 273 సింపుల్ మెజారిటీని కాదని ఏకంగా నాలిగింట మూడోవంతు మెజార్టీని అడుగుతున్న మాటల్లోని ఆంతర్యం తెలిసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాన్నిబ్రహ్మాస్త్రంలా బయటకి తీశారు.

దళిత, బహుజన, గిరిజనులకు దేశాన్ని దూరం చేయడానికి తమ అనుంగులైన కార్పొరేట్లకు దేశాన్ని అప్పనంగా అందివ్వడానికి అడ్డంకిగా ఉన్న రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే వారి ఎత్తుగడలో భాగమే 400కు పైగా స్థానాల్ని అడుగుతున్నారనే కఠోర సత్యాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
మంగళవారం 28 మే 2024

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## బంగ్లాదేశ్ లో బాయ్ కాట్ భారత్? ఏమిటీ లొల్లి?

బంగ్లాదేశ్.. ఈ దేశ ఉనికికి కారణం భారత దేశం. వారి ఆశలకు.. ఆకాంక్షలకు తగ్గట్లు బంగ్లాదేశ్ ను ఏర్పాటు చేసిన భారత్ అంటే.. ఆ దేశీయుల్లో ప్రత్యేకమైన అభిమానం ఉంటుందన్న సంగతి తెలిసిందే. భారత్ తో అత్యంత సుదీర్ఘమైన భూసరిహద్దు కలిగి ఉన్న ఈ దేశం వాణిజ్య అవసరాల కోసం మన మీద ఆధారపడుతుంది. అంతేకాదు.. భారత్ కు ఎంతో దగ్గరైన దేశంగా పేరుంది. అలాంటి దేశంలో ఇప్పుడు కొత్తగా బాయ్ కాట్ భారత్ అన్న నినాదం మొదలు కావటమే కాదు.. అంతకంతకూ విస్తరిస్తోంది. దీనికి కారణమేంటి? దీని వెనుకున్నదెవరు? దీనిపై అక్కడి ప్రభుత్వం ఏం చేస్తుంది? అధికార పార్టీ స్టాండ్ ఏంటి? విపక్షం తీరు ఎలా ఉంది? ఇప్పుడే ఈ వ్యవహారం తెర మీదకు రావటానికి కారణాలు ఏమని చెబుతున్నారు? లాంటి ప్రశ్నలకు సమాధానాల్ని వెతికితే.. అసలీ అంశంపై క్లారిటీ రావటం ఖాయం. ప్రస్తుతం బంగ్లాదేశ్ కు ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారు షేక్ హసీనా. ఆమె ఈ జనవరిలో ఐదోసారి అధికారంలోకి వచ్చారు. ఆమె పవర్లోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియా వేదికగా మొదలైన ఈ ప్రచారం అంతకంతకూ పెరిగి.. ఉద్యమంగా మారింది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటుందని.. తమసొంత ప్రయోజనాల కోసమే షేక్ హసీనాను మళ్లీ ప్రధానిగా చేస్తున్నారంటూ ఐరోపా.. అమెరికాలో ఉంటున్న ప్రవాస బంగ్లాదేశీయులు ఈ ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ ప్రచారానికి దన్నుగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల్ని కొనొద్దని.. వాడొద్దని బంగ్లాదేశ్ ప్రజల్ని కోరుతున్నారు. ప్రస్తుతం పారిస్ లో ఉంటున్న బంగ్లాదేశీ వైద్యుడు పినాకీ భట్టాచార్య ఈ ఆన్ లైన్ ఉద్యమానికి తెర తీసినట్లుగా చెబుతారు. ప్రవాసీ బంగ్లాదేశీల పిలుపుతో బంగ్లాదేశ్ లోని కొన్ని వర్గాలు ఈ నినాదానికి మద్దతు ఇవ్వటంతో దీన్ని రాజకీయ అస్త్రంగా మార్చింది అక్కడి ప్రతిపక్ష పార్టీ బీఎన్ పీ. బాయ్ కాట్ భారత్ నినాదాన్ని అందిపుచ్చుకొని ప్రధాని షేక్ హసీనా భారత అవసరాల కోసమే పని చేస్తున్నట్లుగా ప్రచారాన్ని షురూ చేశారు. తమ వాదనకు బలం చేకూరేలా వారు కొన్ని వాదనల్ని వినిపిస్తున్నారు. అందులో ముఖ్యమైనది.. తాజాగా ముగిసిన బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు. ఇవి అత్యంత వివాదాస్పదమైనవిగా ముద్ర పడింది. ప్రతిపక్షాలు ఎన్నికల్ని బహిష్కరించినప్పటికీ హసీనా ప్రధానిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఆమె విజయం సాధించారన్న వార్తలు వచ్చినంతనే.. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలపటం.. తమ మద్దతును ప్రకటించటమే దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు. అయితే.. బాయ్ కాట్ బంగ్లాదేశ్ ఉద్యమం అక్కడి ప్రజల్లో కాకుండా రాజకీయ ఎజెండాతోనే మొదలైనట్లుగా పలువురు వాదనలు వినిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం ట్రెండింగ్ లో ఉన్నదే తప్పించి వాస్తవంలో ఈ అంశానికి అంత జనాదరణ లేదంటున్నారు. బాయ్ కాట్ భారత్ ఉద్యమంపై ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల్ని బాయ్ కాట్ చేయాలంటే ప్రతిపక్ష బీఎన్ పీ నేతలు ముందు తమ భార్యల చీరలన్నింటికి కాల్చేయాలన్నారు. బీఎన్ పీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల భార్యలు భారత్‌కు వెళ్లి భారీ సంఖ్యలో చీరలు కొనుక్కొని రావటం.. వాటిని బంగ్లాదేశ్ లో అమ్మటం చూశానని చెప్పిన ఆమె.. 'వాటన్నింటిని కాల్చేస్తారా? భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న మసాలాలు.. ఉల్లిపాయలు.. అల్లం.. వెల్లుల్లి లాంటివి లేకుండా విపక్ష నేతలు.. వారి కుటుంబాలు తమ వంటల్ని తయారు చేసుకొని తినాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. మాల్దీవుల్లోనూ భారత వ్యతిరేక నినాదంతోనే అక్కడ అధికారంలోకి వచ్చారు మయిజ్జు. తాజాగా బంగ్లాదేశ్ లోనూ ఇదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్న వైనం చూస్తే.. సమ్ థింగ్ రాంగ్ అన్న భావన కలుగక మానదు. ఇదిలా ఉంటే రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్ కు 50వేల టన్నుల ఉల్లిగడ్డల్ని పంపాలని భారత్ నిర్ణయించటం గమనార్హం. ఏమైనా ఈ తరహా ఉద్యమాల్ని షురూ చేసే వారి బ్యాక్ గ్రౌండ్ విషయంలో భారత మీడియా సైతం చురుగ్గా పని చేయటంతో పాటు.. అందులోని కుట్రల్ని ఛేధించాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

# లేలేత ప్రాయం... సెల్‌గాటం



హైదరాబాద్: అంతా మైనర్ కుర్రాళ్లే.. సాయంత్రం దాటినా.. ఒంటరిగా కనిపించినా చెలరేగిపోతారు. గల్లీల్లో నడుచుకుంటూ వెళ్లేవారిని మాటల్లో పెట్టి ఫోన్లు లాక్కుంటారు. నిర్మానుష్య ప్రాంతంలో ఒక్కరే కనిపిస్తే అటకాయించి అందినకాడికి దోచుకుని భయభ్రాంతులకు గురిచేస్తారు. అవసరమైతే హతమార్చేందుకు వెనుకాడరు. నగరంలో సెల్‌ఫోన్ చోరీల్లో ఎక్కువగా మైనర్లు పట్టుబడడం ఆందోళన రేకెత్తిస్తోంది. కొన్నినెలలుగా మూడు కమిషనరేట్లలో సెల్‌ఫోన్ చోరీ కేసులు.. వాటిలో పట్టుబడ్డ నిందితుల నేపథ్యాన్ని పరిశీలించగా.. ఎక్కువ మంది మైనర్లు, 20 ఏళ్లలోపువారు అధికంగా ఉంటున్నారు. ప్రధానంగా కొందరు పాత నేరగాళ్లు, పిక్‌పాకెట్ గ్యాంగ్‌లు.. యువకులు, మైనర్లకు వేతనాల తరహాలో నెలవారీగా కొంత మొత్తం లేదా ఖర్చులకు సరిపడా డబ్బులిచ్చి సెల్‌ఫోన్ చోరీలు చేయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కొన్ని గ్యాంగ్‌లు ఎన్ని ఫోన్లు చోరీ చేస్తే అంత కమిషన్ అన్నట్లు ఆశపెడుతున్నాయని, మైనర్లను ఒక అస్త్రంగా ఉపయోగించుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వీళ్లకు ఖర్చులు.. వాళ్లకు ఆదాయం

గతంలో పిక్‌పాకెటింగ్ గ్యాంగ్‌లు రద్దీ ప్రదేశాలు, బస్సులు, రైళ్లలో చోరీ చేసి సొమ్ము చేసుకునేవారు. ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగాక జేబులో నగదు పెట్టుకునేవారి సంఖ్య తగ్గింది. పిక్‌పాకెటర్లు చోరీ చేస్తున్నా డబ్బు దొరకడం లేదు. దీంతో సెల్‌ఫోన్ చోరీలపై దృష్టిసారించారు. పెద్దలైతే పట్టుబడితే చితకబాదుతారని.. మైనర్లు, తక్కువ వయసున్నవారైతే చూసీచూడనట్లు వదిలేస్తారనే ఉద్దేశంతో కొన్ని గ్యాంగ్‌లు మైనర్లు, 20 ఏళ్లలోపు యువకుల్ని రంగంలోకి దింపుతున్నాయి. ప్రధానంగా చదువు మధ్యలో మానేసినవారు, తల్లిదండ్రుల ఆలనాపాలనా సరిగా లేక జులాయిగా తిరిగే కుర్రాళ్లు ఈ ముఠాల లక్ష్యం. వారి జల్సాలు, ఇతర అవసరాలకు డబ్బు ఆశచూపి ముగ్గులోకి దింపుతారు. ఆ తర్వాత డబ్బు ఎక్కువ అవసరముంటే సెల్‌ఫోన్ దొంగతనాలు చేయాలని ఆశపెడుతున్నారు. కొందరికి రుణాలు ఇచ్చి తీర్చకపోతే చెప్పినట్లు చేయాలంటూ మెలికపెడతారు. దారిలేని పరిస్థితుల్లో కొందరు మైనర్లు, యువకులు స్నేహితులతో కలిసి చోరీలు చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఇంకొందరు తల్లిదండ్రులు ఇచ్చే డబ్బు సరిపోక చోరీల బాట పడుతున్నారు. మెజార్టీ కేసుల్లో యువకులు రూ.వెయ్యి రూ.2 వేలకు ఆశపడి ఫోన్లు చోరీ చేస్తున్నారు.

ఎంతోకొంతకు అమ్మడమే

నగరంలో చోరీ ఫోన్లకు పెద్ద మార్కెట్ ఉంది. కొట్టేసిన ఫోన్ల ఐఎంఈఐ నెంబర్లను మార్చేసే ముఠాలు.. అవసరమైతే గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు తరలించి సగం ధరకు అమ్మేసేవారున్నారు. ఇటీవల హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సెల్‌ఫోన్ దొంగిలించే ముఠాలోని 17 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో కొట్టేసిన ఫోన్లను వీరు సుడాన్ దేశానికి తరలించి అమ్మేస్తున్నారు. ఇతరులకు విక్రయించడానికి సాధ్యంకాని ఖరీదైన, భద్రత వ్యవస్థలు ఎక్కువగా ఐఫోన్ వంటి వాటి విడిభాగాలను ఊడదీసి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. నగరంలోని కొన్ని సెల్‌ఫోన్ దుకాణాల్లో కొట్టేసిన ఫోన్లు విక్రయించడాన్ని ఒక వ్యాపారంగా మార్చుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కొందరు దుకాణ యజమానులు మైనర్లతో చోరీచేయిస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

ఫిర్యాదుకు ససేమిరా

నగరంలో ఏటా వేల సంఖ్యలో ఫోన్లు చోరీ ఘటనలు నమోదవుతున్నా చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసేందుకు కేంద్ర టెలికాం విభాగం సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఫిర్యాదుల సంఖ్య, ఫోన్ల రికవరీ పెరిగింది. ఒక ఫోన్‌పోతే ఇంకోటి కొనుక్కోవచ్చని లేదా పాత ఫోన్ కదా అని వదిలేయడం వంటి కారణాలు ఉంటున్నాయి.

ఇవీ ఉదాహరణలు..

గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడు బస్సు కోసం ఎదురుచూస్తుండగా బైకుపై వచ్చిన ఇద్దరు సెల్‌ఫోన్ లాక్కున్నారు. బాధితుడు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా కత్తులతో దారుణంగా పొడిచారు. దీంతో అతను అక్కడికక్కడే మరణించారు. ఆ ఇద్దరిలో ఒకరికి 19 ఏళ్లు, ఇంకొకరు మైనర్.

సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలో దొంగిలించి సుడాన్ దేశానికి పంపిస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులు ఇద్దరూ 19 కుర్రాళ్లు. వీరి కొట్టేసిన ఫోన్లను కొందరు సెల్‌ఫోన్ దుకాణ యజమానులు కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత మన దేశంలో సుడాన్ దేశస్థులు కొని.. వారి దేశానికి అక్రమంగా పంపిస్తున్నారు.

బుధవారం నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సెల్‌ఫోన్ దొంగిలిస్తున్న యువకుల్ని అరెస్టు చేశారు. ఇందులో నలుగురు మైనర్లు, మిగిలిన ఐదుగురూ 19 ఏళ్ల కుర్రాళ్లు కావడం గమనార్హం. జల్సాల కోసం సెల్‌ఫోన్ దొంగతనాలు చేస్తున్నట్లు వీరంతా అంగీకరించారు.

# ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి

జగిత్యాల : ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో 1.31 లక్షల ఎకరాల్లో సాగుచేయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి నిరుటి నుంచి మొక్కలను పెంచుతూ రైతుల తోటల్లో నాటుతున్నారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే గానుగ(క్రషింగ్‌ద్వారా నూనెతీసే) పరిశ్రమలున్నాయి. ముందుగా నాటిన మొక్కల్లో వచ్చే సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుంది కాబట్టి జగిత్యాల జిల్లాలోని యశ్వంతరావుపేటవద్ద క్రషింగ్ యూనిట్ను ఏర్పాటు చేస్తుండగా ఉమ్మడి జిల్లాలో మరో రెండు చోట్ల పరిశ్రమలకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో ఇవ్వనుండగా ఈ మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాల్సి ఉంది. మనప్రాంత రైతులకు సాగు అనుభవంలేని పంట కాబట్టి భారత ఆయిల్‌పామ్ పరిశోధనసంస్థ, ప్రైవేటు కంపెనీల శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించి పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతరపంటల సాగును రైతులకు తెలపాలి. వడ్ల అమ్మకం సమస్యలు, మామిడిలో చీడపీడలు, ఇతర పంటల సాగులోనూ వన్యప్రాణుల



బెడద, కూలీల కొరత, ఉత్పత్తుల విక్రయ సమస్యలు తదితరాలతో ఉమ్మడి జిల్లాలో రైతులు ఆయిల్‌పాం సాగుపై ఆసక్తిగా ఉండగా గెలల అమ్మకం, ధరల తగ్గుదల, విక్రయ సమస్యలు తలెత్తకుండా చూడాలి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.42,000 వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా అయిదేళ్లనుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే రైతులకు పంట రుణాన్ని మంజూరివ్వాలి, పంటలబీమాను వర్తింపచేయాలి. ఇప్పటికే నాటిన తోటల్లో చర్యలతో పాటు వానాకాలంలో నూతనంగా మొక్కల నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉద్యానశాఖ జగిత్యాల జిల్లా అధికారి ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు.

# చెరువు కనిపిస్తే .. చెరపట్టుడే



హైదరాబాద్ : హైదరాబాద్ చుట్టూ సహజసిద్ధమైన చెరువులుంటే చాలు.. రియల్ వెంచర్ల కోసం కొందరు పాగా వేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలతో వాటిని పూడ్చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పదుల సంఖ్యలో చెరువులను ఆక్రమించేశారు. మొత్తంగా రంగారెడ్డి జిల్లాలో 1720, మేడ్చల్ జిల్లాలో 890 చెరువులు ఉండగా వీటిలో 30శాతం కబ్జాకు గురయ్యాయి. చెరువులను పరిరక్షించేందుకు పురపాలక శాఖ, హెచ్ఎండీఏ, పర్యాటక శాఖ అధికారులు సుందరీకరణ పేరిట రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రయోజనాలు నామమాత్రంగానే ఉన్నాయి.

కుంటలు మాయం

శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నంబరు 133, 134లో 2.35 ఎకరాల మేర జంగంమోని కుంట ఉంది. దీన్ని కబ్జాదారులు మట్టితో పూడ్చేస్తున్నారు. ఇప్పటికే బండరాళ్లు, మట్టి నింపి చదునుచేయడంతో కుంట పూర్తిగా మైదానంలా తయారైంది. ఈ కుంట స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.వంద కోట్లు ఉంటుంది. పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇక మియాపూర్ బస్ డిపో సమీపంలోని మీది కుంటను మట్టితో పూడ్చి మాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ ఎకరా ధర రూ.50కోట్ల పైమాటే. రియల్ వెంచర్లు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు తెలిపారు.

శేరిలింగంపల్లి.. గండిపేట్.. జేంద్రనగర్..

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చెరువుల పరిరక్షణకు వాటి సుందరీకరణకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా మరోవైపు కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయి. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో అధికంగా చెరువులను ఆక్రమించేస్తున్నారు. రాత్రివేళ నిర్మాణ వ్యర్థాలను చెరువుల్లో పోస్తున్నారు. ఈ మూడు మండలాల్లో 38 చెరువులను ఇలాగే ఆక్రమించి రియల్ వెంచర్లు వేశారు. కొందరైతే ఎఫ్‌టీఎల్ పరిధుల్లో విల్లాలు నిర్మిస్తున్నారు. ఇక మేడ్చల్ జిల్లాల్లోని శామీర్‌పేట పెద్ద చెరువు సహా తూంకుంట మున్సిపాలిటీ, జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధుల్లోని చెరువుల్లో నిర్మాణాలు చేపట్టారు. కుంటల మధ్యలో సీసీరోడ్లు వేశారు.

# క్షేత్ర స్థాయిలో పనిభారం

భువనగిరి : అసలే వేసవి కాలం.. దీనికితోడు వ్యవసాయ పనులు లేవు.. ఇంకేముంది జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీల సంఖ్య క్రమేణా పెరుగుతూనే ఉంది. ఊరూరా ముమ్మరంగా పనులు జరుగుతున్నప్పటికీ క్షేత్రసహాయకులు తక్కువగా ఉండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఉన్నవారిపైనే అదనపు భారం పడుతోంది. తరచూ మారుతున్న నూతన విధానాలు, మౌఖిక హాజరు, ఆన్‌లైన్‌లో నమోదు లాంటి ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గ్రామ పంచాయతీకి ఒకరు ఉంటే పనుల్లో మరింత వేగం పెరిగేది. గత కొన్నేళ్లుగా నూతన క్షేత్రసహాయకుల నియామకం చేపట్టకపోవడంతో ఉన్నవారికే రెండు నుంచి మూడు గ్రామాల అదనపు బాధ్యతలు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ఉపాధి పనిని గుర్తించాల్సి ఉంటుంది. అందుకు గ్రామానికి ఒకరు చొప్పున క్షేత్రసహాయకులు ఉండాలి. నూతన గ్రామ పంచాయతీల్లోనూ కొత్తవారి నియామకం చేపట్టకపోవడంతో పథకం నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 1,740 గ్రామ పంచాయతీలుండగా కేవలం 1,078 మంది క్షేత్రసహాయకులు మాత్రమే విధులు చేపడుతున్నారు. అంటే సుమారు 662 మంది క్షేత్రసహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్న కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వేసవి కారణంగా జోరుగా పనులు..


వేసవి నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు నెలలుగా ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. సగటు దినసరి కూలీని ప్రభుత్వం ఇటీవల రూ.300 చేయడం, వ్యవసాయ పనులు మందగించడం తదితర కారణాల వల్ల ఉపాధి పనులకు వెళ్తున్న కూలీల సంఖ్య క్రమేణా పెరుగుతుందనే చెప్పవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకుని క్షేత్రసహాయకుల నియామకాలను ప్రభుత్వం చేపడితే పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది. పనిదినాలు, ఇతర లక్ష్యాలను పూర్తి చేయకపోవడం, ఇతర కారణాల వల్ల కొందరు క్షేత్రసహాయకులపై ప్రభుత్వం వేటు వేస్తోంది. వారి స్థానంలో స్థానికంగా సీనియర్ మేట్లకు బాధ్యతలు అప్పగిస్తోంది. ముఖ్యంగా ప్రతి క్షేత్రసహాయకుడు నిత్యం కూలీల మౌఖిక హాజరు నమోదు, క్షేత్రస్థాయిలో పని చేపడుతున్న ఫొటోలు అప్‌లోడ్ చేయడం, పనుల పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుంది. గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున రోజూ రెండు లక్షల మంది కూలీలు హాజరవుతున్నారు. 'ప్రతి గ్రామ పంచాయతీకి ఒక క్షేత్రసహాయకుడిని నియమించే విషయమై వివరాలు ప్రభుత్వానికి నివేదించినట్లు' సంబంధిత అధికారులు చెబుతున్నారు.

# అయిదు లక్షల మందికి బీసీజీ టీకా

కరీంనగర్ : కరీంనగర్ పట్టణం: 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా ఇవ్వడానికి వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. క్షయ(టీబీ) నిర్మూలనలో భాగంగా మొదటి దశ కింద టీకా ఇచ్చేందుకు మన రాష్ట్రంలో 17 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో కరీంనగర్, జగిత్యాల ఉన్నాయి. సుమారు అయిదు లక్షల మందికి పైగా ఈ టీకా వేసేందుకు అర్హులు ఉండవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. జిల్లా జనాభాలో 25 శాతం మందిని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలో రెండు జిల్లాలో ఇది ప్రారంభం కానుంది. అప్పటి నుంచి మూడు నెలల్లో టీకా కార్యక్రమం పూర్తి చేసేందుకు వీలుగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

వైద్యాధికారులకు శిక్షణ..

2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ఈ టీకా ఇస్తారు. ఇప్పటివరకు పిల్లలకే బీసీజీ వ్యాక్సిన్ ఇస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా దీనిని అమలు చేస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన అందరికీ ఈ టీకా ఇస్తారు. అదేవిధంగా ఏదైన కుటుంబంలో టీబీ వ్యాధిగ్రస్థులున్నా.. ఆ లక్షణాలు కనిపించినా.. ఆ ఇంటా 18 ఏళ్లు దాటిన వారందరికీ వ్యాక్సిన్ ఇవ్వాలని భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో డీఎంహెచ్, క్షయ నివారణ అధికారి వంటి జిల్లా వైద్యాధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాలలో పని చేసే ఏఎన్ఎంలు, ఆశా



కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారు.

గుర్తింపు ఇలా...

60 ఏళ్లు పైబడిన వారు బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారు, మద్యం తాగేవారు.

ప్రస్తుతం పొగ తాగుతున్న వారు, గతంలో అలవాటు ఉన్న వారు.

అయిదేళ్లుగా క్షయ వ్యాధిగ్రస్థులున్న ఇంట్లోని ఇతర కుటుంబ సభ్యులకు.

క్షయ వ్యాధితో ఉన్న వారితో సన్నిహితంగా మెదిలేవారు.

ఆగస్టులో ప్రారంభం

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి

ఆగస్టులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశముంది. ఈలోగా వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తాం. ఇంటింటా సర్వే నిర్వహించి అవసరమైన వారిని గుర్తిస్తాం. టీకా ఇవ్వడానికి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ వ్యాక్సినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లు చేస్తాం. టీకా తీసుకునేందుకు ఇష్టపడని వారికి ఇవ్వం.

# పంటల బీమా.. అన్నదాతకు ధీమా..!

నల్గొండ : జూన్ 1న మొదలయ్యే వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి ఉపశమనం కలగనుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా రైతులతో పాటూ పంటల విస్తీర్ణం సైతం ఉమ్మడి నల్గొండలోనే ఎక్కువగా ఉంది. ఏటా రెండు సీజన్లలో ప్రకృతి ప్రకోపాలు, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాదీ యాదాద్రి జిల్లాలోని వలిగొండ, మోత్కూరు, భువనగిరి, గుండాల, ఆలేరు, ఆత్మకూరు (ఎస్) ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. దానిని కొనుగోలు చేయాలని రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం ఏప్రిల్ నెలలో కురిసిన వర్షాలకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని సుమారు లక్ష ఎకరాల్లో పంట నష్టం జరిగింది. సగటున రెండు సీజన్లలో కలిపి సుమారు రూ.100 కోట్ల మేర రైతులు నష్టపోతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయినా అటు ప్రభుత్వం నుంచీ రైతులకు ఎలాంటి ఆర్థిక భరోసా దక్కలేదు. మరోవైపు ఏటా ఏప్రిల్ మొదటి వారం నుంచి అకాల వర్షాలు, ఈదురుగాలులకు కోత దశలో ఉన్న పంటలు నేలరాలిపోతున్నాయి. గత నాలుగేళ్ల నుంచి భారాస ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి రూపాయి దక్కని దుస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)ను కొన్నాళ్లు రాష్ట్రంలో అమలు చేసిన అప్పటి కేసీఆర్ సర్కారు వచ్చే బీమా కంటే రైతులకు కట్టే ప్రీమియం చెప్పి ఈ పథక అమలును రాష్ట్రంలో నిలిపివేసింది.

# స్త్రీనిధి రుణాల గోల్‌మాల్!



కరీంనగర్ : స్వశక్తి సంఘాల సభ్యుల అవసరాలకు స్త్రీనిధి రుణాలు ఇస్తుండగా తిరిగి చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. రూ.లక్షల్లో బకాయిలు చెల్లించలేదనే విషయం ఆడిట్ తనిఖీల్లో బయటపడినా, ఆ బ్యాంకుకు చెల్లించడంలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. భారీగా బకాయిలు ఉన్న స్త్రీనిధి వివరాల జాబితా మెప్మా పీడీ, నగర పాలక కమిషనర్‌కు చేరింది. జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నగర పాలికలు, పురపాలికల్లో స్వశక్తి సంఘాలు ఉన్నాయి. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవడానికి బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు, స్త్రీనిధి రుణాలు వంటివి మంజూరు చేస్తారు. బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు మాత్రం బ్యాంకులు ఇస్తుండగా స్త్రీనిధి రుణాలు మాత్రం బ్యాంకులతో సంబంధం లేకుండా తీసుకునే వీలుంది.

నగర పరిధిలో 4,223 సంఘాలుండగా 158 సమాఖ్యలు, రెండు పట్టణ సమాఖ్యలు ఉన్నాయి. సమాఖ్యలన్నీ కలిసి పట్టణ సమాఖ్య ద్వారా స్త్రీనిధికి వాటాధనం తీసుకుంటాయి. సమృద్ధి పొదుపు ద్వారా సమాఖ్యకు రుణాలు తీసుకోవడానికి అర్హత లభిస్తుంది. రుణాన్ని తీసుకోవడానికి ఆన్‌లైన్‌లో పొందుపర్చితే చాలు రుణం మంజూర వుతోంది. ముందుగా సమాఖ్య సంఘాల సభ్యులు తీర్మానం చేస్తారు. రూ.3 లక్షల వరకు తీసుకునే రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉ ంటుంది. నోటీసులకు ఏదీ స్పందన?

స్త్రీనిధి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించని సంఘాల్లోని సభ్యులకు, ఓబీలు, ఆర్పీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఈనెల 17న స్త్రీనిధి కార్యాలయం నుంచి కమిషనర్, మెప్మా పీడీకి లేఖ వచ్చింది. రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొనడంతో తదుపరి నిర్ణయం తీసుకోవడానికి స్త్రీనిధి ఆర్ఎంతో కలిసి ఇన్‌ఛార్జ్ పీడీ స్వరూపరాణి సమీక్షించారు.

రూ.69.84 లక్షలు..

స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను సంఘాల సభ్యులు చెల్లిస్తుండగా కొందరు ఆర్పీలు, ఓబీలు ఇష్టారాజ్యంగా సొంత ఖాతాల్లో మళ్లించుకున్నారు. నాలుగేళ్లుగా పరిశీలిస్తే కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండికి చెందిన 18 సమాఖ్యలకు సంబంధించి నలుగురు ఓబీలు, 15 మంది ఆర్పీలు రూ.69.84 లక్షలు చెల్లించకుండా గోల్‌మాల్ చేశారని తేలింది. అత్యధికంగా ఒక ఆర్పీ రూ.13 లక్షలు, మరొక ఆర్పీ రూ.15 లక్షల మేరకు వాడుకున్నారు. అయితే మెప్మాలో పని చేసే సీవోలకు, ఆపై ఉన్న ఉద్యోగులకు మాత్రం దీనిపై ఆజమాయిషి ఉండదు. దీనికి పూర్తిగా ఓబీలు, ఆర్పీలే బాధ్యత వహించాల్సి ఉ ంటుంది.

తనిఖీల్లో వెలుగులోకి..

స్త్రీనిధి రుణాలను సొంత అవసరాలకు బదలాయించుకున్నారు. సంఘాల సభ్యుల నుంచి తిరిగి రుణం వసూలు చేస్తుండగా ఆ మొత్తాన్ని కొన్ని సమాఖ్యల ఓబీలు, కొందరు ఆర్పీలు స్త్రీనిధి ఖాతాల్లో జమ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారు. నాలుగేళ్లుగా ఇలాగే బకాయిలు పడుతుండగా కనీసం చెల్లింపులు చేయకుండా దాట వేసే ధోరణి అవలంబించారు. స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ద్వారా ఆడిట్ తనిఖీలు చేయగా ఏయే సమాఖ్య, ఏ ఆర్పీ ఎంత మేరకు వాడుకున్నారనే విషయాలన్నీ బయటపడ్డాయి.

కమిషనర్ల నుంచి నివేదిక తీసుకుంటాం

– స్వరూపరాణి, ఇన్‌ఛార్జి పీడీ, మెప్మా, కరీంనగర్

అవకతవకలకు పాల్పడిన ఆర్పీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఆయా కమిషనర్ల నుంచి నివేదిక తీసుకుంటాం. అప్పటికీ రికవరీ కాకపోతే కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం.

# 24 కిలోమీటర్లు.. 4 వరుసలు

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు రూ.150 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ అంచనాలు రూపొందించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌కు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలన్న సిఫార్సుల మేరకు ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించారు. గతంలో హుస్నాబాద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఉండేది. జిల్లాల విభజన తర్వాత హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలు సిద్దిపేట జిల్లాలో కలిశాయి. ఇప్పటికీ ఆ ప్రాంతాల నుంచి ప్రజలు వాణిజ్య, వైద్య సదుపాయాల కోసం కరీంనగర్‌కు వస్తుంటారు.

రెండు భాగాలుగా..హుస్నాబాద్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాపూర్ గ్రామంతోపాటు చిగురుమామిడి మండలం కరీంనగర్ జిల్లాలోనే ఉంది. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు 24 కిలోమీటర్లలో 8 కిలోమీటర్లు మినహాయిస్తే దాదాపు 16 కిలోమీటర్లు కరీంనగర్ జిల్లా పరిధిలోకి వస్తుంది. ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రెండు భాగాలు చేసి రూ.70 కోట్ల వ్యయంతో ఒక భాగం, రూ.80 కోట్ల వ్యయంతో మరో భాగం నాలుగు వరుసలతో వంద ఫీట్ల రోడ్‌గా నిర్మిస్తారు. ప్రస్తుతం 60 ఫీట్ల రోడ్డుగా ఉన్నా.. అక్కడక్కడ దెబ్బతింటూనే ఉంటుంది.

అందరికీ ఆమోదయోగ్యంగా..గ్రామాల్లో ఇళ్లకు నష్టం జరగకుండా బైపాస్ రహదారి వేసేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. మొత్తమ్మీద అభ్యంతరాలు తలెత్తకుండా.. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రహదారి నిర్మించాలని మంత్రి ప్రభాకర్ అధికారులకు ఆదేశించారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ రహదారి విషయమై ఒక సంస్థతో సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. నివేదిక సమర్పించగానే నిధులు మంజూరు పొంది పనులు చేపట్టనున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికార వర్గాలు ధ్రువీకరించాయి. హుస్నాబాద్ మండలాన్ని కరీంనగర్ జిల్లాలో విలీనం చేసే అంశం కూడా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై మంత్రి ప్రభాకర్ ఎన్నికల్లో హామీ కూడా ఇచ్చారు.

# బాలలూ.. మీకెందుకు వాహనాలు



హైదరాబాద్: మద్యం తాగి కారు నడిపి ఇద్దరు టెకీల మరణానికి కారణమైన పుణెకు చెందిన మైనర్ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో గ్రేటర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలోనూ మైనర్లు విచ్చలవిడిగా కార్లు, బైకులు నడుపుతున్నారు. తల్లిదండ్రులు వారించక కేసుల్లో ఇరుక్కుంటున్నారు. పుణెలో 12వ తరగతి విద్యార్థి మద్యం తాగి కారు అతివేగంగా నడిపి బైక్‌పై వెళుతున్న ఇద్దరు టెకీలను ఢీకొనడటంతో వారు మృతిచెందగా మైనర్‌కు వెంటనే బెయిల్ రావడంతో మృతుల కుటుంబికులు ఆందోళనకు దిగారు. మైనర్‌కు కారు ఇచ్చినందుకు, మద్యం సరఫరా చేసినందుకు తండ్రితోపాటు బార్ యజమానులను అరెస్టు చేసినా ఆందోళన ఆగడం లేదు. 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ నేర్చుకొని లైసెన్సు పొందిన తర్వాతే కారు లేదా ద్విచక్ర వాహనాలు నడిపేందుకు అర్హత వస్తుంది. నగరంలో పదోతరగతి, ఇంటర్ చదివేవారే డ్రైవింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులకు తెలిసి కొందరు, తెలియక కొందరు వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, నిబంధనలు గురించి తెలియక ప్రమాదాలకు కారణమవుతున్నారు.

దొరికితే ఇబ్బందే..

మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. పెద్దలు అభ్యంతరం చెప్పకపోవడం కూడా నేరమే. అలా చేస్తే వాహన యజమాని శిక్షార్హుడు. ముఖ్యంగా యువత, ఉద్యోగులకు జైలుశిక్ష పడితే వారి కెరీర్‌పై ప్రభావం చూపుతుంది. నగరంలో జరుగుతున్న తనిఖీల్లో 20–30 శాతం మందికి డ్రైవింగ్ లైసెన్సులు ఉండటం లేదు. కొందరు లైసెన్సులు గడువు తీరినా పునరుద్ధరించుకోవడం లేదు.

శిక్షణే రక్షణ..

కారు లేదా బైకు నడపాలంటే శిక్షణ తప్పనిసరి. డ్రైవింగ్ శిక్షణ స్కూలు పకడ్బందీగా ఉండాలి. కంప్యూటర్ ఆధారిత నమూనా కారులాంటి యంత్రం (సిమ్యులేటర్) తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. యాక్సిలరేటర్, బ్రేక్, క్లచ్‌పై అవగాహన కల్పిస్తారు. 1 నుంచి 5 వరకు గేర్లు ఎలా మార్చాలి.. ఎక్కడ ఏ గేరు వాడాలి.. పూర్తిగా గేర్లు మార్చే విధానంపై శిక్షణ ఉంటుంది.

వాహనం ఎత్తుగా ఉన్న ప్రాంతానికి వెళ్లేటప్పుడు, పల్లపు ప్రాంతానికి దిగేటప్పుడు ఏం చేయాలి.. ఎడమ, కుడి మలుపులు, యుటర్న్‌లు తీసుకునేప్పుడు జాగ్రత్తలు చెబుతారు.

ఇక రహదారులపై ట్రాఫిక్‌లో నడిపే విధానం.. ఓవర్ టేకింగ్.. సిగ్నళ్ల వద్ద నిలిచే విధానం.. ఏ గేరులో ఉండాలి.. ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలను సిమ్యులేటర్‌పై శిక్షకుడు వివరిస్తారు.

వర్షం, మంచు కురుస్తున్న సమయంలో డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ఏ లైట్లు వినియోగించాలో నేర్పిస్తారు. స్టీరింగ్ పట్టుకునే విధానం.. దానిని ఉపయోగించే తీరుపై సిమ్యులేటర్‌పై నేర్చుకోవచ్చు.

ట్రాఫిక్ నిబంధనలు.. సూచనలు.. ఆర్టీఏ చట్టాలు.. వాటిని ఉల్లంఘిస్తే విధించే జరిమానాలు గురించి వివరిస్తారు.

శిక్షణకు ముందు సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో ఎల్‌ఎల్‌ఆర్ తీసుకోవాలి. అది ఉంటేనే శిక్షణ వాహనం నడపేందుకు అవకాశం ఉంటుంది. శిక్షణ పూర్తి అయిన తర్వాత ధ్రువపత్రం ఇస్తారు.

# ఆత్మీయ జ్ఞాపకం.. నెరవేరని లక్ష్యం



వికారాబాద్: సందర్శకులకు ఆహ్లాదం పంచే లక్ష్యంతో పాటు తమ పూర్వీకుల గుర్తుగా ఉంటుందనే ఉద్దేశంతో ధారూర్‌లో ఏర్పాటుచేసిన 'స్మృతి వనం' ప్రజాదరణకు దూరమవుతోంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో అలంకారప్రాయంగా మారుతోంది. ఆత్మీయుల పేరు మీద మొక్కల పెంపకంజీవిత కాలం తమకు సేవ చేసి గతించిన కుటుంబ పెద్దల జ్ఞాపకాలు చిరకాలం గుర్తుండేలా ఆత్మీయుల పేరుమీద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో 2019లో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ధారూర్ మండల కేంద్రంలోని సోమశంకరప్ప దేవాలయం సమీపంలో తాండూర్–వికారాబాద్ ప్రధాన రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 6 ఎకరాల్లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం అప్పటి పాలనాధికారి ఒమర్‌జలీల్ రూ.19.04 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటితో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఊయలలు, జారుడు బల్లలు, పెద్దలు సేద తీరడానికి అందమైన కట్టడం, చెట్లకింద కూర్చోవడం కోసం రచ్చబండలు నిర్మించారు. అందరినీ ఆకట్టుకునేలా అందమైన ముఖద్వారం దానికి ఇరువైపులా వివిధ రకాల జంతు, ప్రకృతి సౌందర్య చిత్రాలు వేయించారు. ఆరంభంలో అందరి దృష్టి ఆకర్షించినా కాలక్రమంలో పర్యవేక్షణ లేక కళా విహీనంగా మారింది.

ఇప్పటి వరకు కేవలం ఆరుగురే..

స్మృతి వనం ఏర్పాటుచేసి ఐదేళ్లు గడుస్తున్నా మొక్కలు నాటించే కార్యక్రమం అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఇప్పటి వరకు కేవలం ఆరుగురు ఉన్నతాధికారులు మాత్రమే మొక్కలను ఇక్కడ నాటారు. అటవీ శాఖ అధికారులు కొన్ని మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తున్నారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవచూపి మరింత అవగాహన కల్పిస్తే వనం ప్రజాదరణ పొందుతుందని, ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతుందని స్థానికులు కోరుతున్నారు.

మొక్క నాటేందుకు రూ.5,000 జమచేస్తే చాలు

స్మృతి వనంలో ఆత్మీయుల పేరిట మొక్కలు నాటాలనుకునే వారు అటవీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే బ్యాంకు ఖాతాలో ఒక్కో మొక్కకు రూ.5 వేలు జమచేస్తే చాలు. అటవీ సిబ్బంది మొక్కలు నాటి సంరక్షిస్తారు. అందుకోసం స్మృతి వనంలోనే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచారు. కొందరు ఆత్మీయుల జ్ఞాపకాలు ఎన్నటికీ మరువలేనివి. అలాంటి వారి పేరుమీద మొక్కలు నాటి వాటి నీడన కూర్చుని వారితో ఉన్న అనుబంధాన్ని, గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటే ఆ అనుభూతే వేరు. తమ ఆత్మీయుల పేరున నాటిన మొక్క ఎలా ఉందో పరిశీలించుకునే అవకాశం కూడా ఉంది.

# అడుగుకో అగా దం.. ప్రమాదాల ప్రయాణం



హైదరాబాద్ : రాజధానిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. సగానికిపైగా వీధుల్లో గుంతలు దర్శనమిస్తున్నాయి. అర కిలోమీటరు కూడా సాఫీగా ప్రయాణించలేని దుస్థితి. నాలుగేళ్లుగా రహదారి పనులు నిలిచి పోవడమే ఇందుకు కారణం. ఫలితంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల్లో ప్రయాణిస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారు. వర్షం కురిస్తే వరదతో రోడ్లు మరింత ప్రమాదకరంగా మారుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉదాహరణలివిగో.. ఉప్పరపల్లి నుంచి నలందా నగర్ మీదుగా లంగర్‌హౌజ్ వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలే. అత్తాపూర్, హైదర్‌గూడ, రాజేంద్రనగర్, కాటేదాన్ ప్రాంతాల్లోని కాలనీ రోడ్లు దారుణంగా ఉన్నాయి.లంగర్‌హౌజ్ ప్రధాన రహదారిపై వర్షం వెలిసినా.. వరద అలాగే ఉంటుంది. దాదాపు వంద మీటర్ల మేర వరద నిలుస్తోంది.

మల్కాజిగిరి సాయినగర్ సూర్యా టవర్ లేన్ రోడ్డును ఏడాది క్రితం తవ్వి, నేటికీ పనులు చేపట్టలేదు.

కేపీహెచ్‌బీ కళామందిర్ వద్ద, కొండాపూర్‌లోని కొత్తగూడ ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ చుట్టుపక్కల కాలనీ రోడ్లపై అడుగడుగునా గుంతలే. ఓల్డ్ అల్వాల్ మంజీర కాలనీ, ఆర్‌కేపురం సైనిక్ నగర్‌లో ఏడాది కింద తవ్వి, నేటికీ మరమ్మతు చేయలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు.

కాలనీ రహదారులే ఎక్కువ..

సీసీ రోడ్లు 6,167 కి.మీ

నగరంలో మొత్తం రోడ్ల పొడవు 9,013 కి.మీ

అందులో బీటీ రోడ్లు 2,846 కి.మీ

రూ.వేల కోట్లు.. అయినా రోడ్లకు తూట్లు..

నగరంలో నాలుగు లైన్లు, అంతకన్నా ఎక్కువ వెడల్పు ఉండే 811 కి.మీ ప్రధాన రహదారులను జీహెచ్‌ఎంసీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చింది. ఐదేళ్ల నిర్వహణకు రూ.1,839 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. మొదటి మూడేళ్లలో పలు ప్రాంతాల్లో నూతన రోడ్లు నిర్మించాలి. తర్వాత రెండేళ్లు గుంతలు పడకుండా చూసుకోవాలి. కానీ ప్రైవేటు రోడ్లపై ఎక్కడ చూసినా భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. నగరంలో కాలనీ రోడ్లను తాగునీరు, మురుగునీటి పైపులైన్లు, విద్యుత్తు కేబుళ్ల కోసం తరచుగా తవ్వుతున్నారు. మరమ్మతులు మాత్రం చేయడం లేదు.

గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలన్న లక్ష్యంతో జీహెచ్‌ఎంసీ ఏటా రూ.25 కోట్లు వెచ్చించి ఐఆర్‌టీ బృందాలను నియమిస్తుంది. ఇంజినీర్లు ఆయా బృందాల వద్ద కమీషన్లు తీసుకుని, పనులు చేయకున్నా.. బిల్లులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి.

# హరితహారానికి సన్నద్ధం

కోరుట్ల: ప్రభుత్వం ఏటా వర్షాకాలంలో హరితహారం కార్యక్రమం చేపడుతుంది. ఇందులో భాగంగా పట్టణాల్లో పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు అమలు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలోని అయిదు పట్టణాల్లో హరితహారానికి బల్దియా అధికారులు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. పట్టణాల్లో ఏఏ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి, ఇళ్లలో ప్రజలతో నాటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్ల కిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, ఇతర చాలచోట్ల మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తిస్తున్నారు. పట్టణ ప్రగతి నర్సరీలలో మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచుతున్నారు.

ప్రత్యేక నిధులు..

నాలుగేళ్లుగా పట్టణాల్లోనే ప్రత్యేకంగా పట్టణ ప్రగతి నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను బల్దియా అధికారులు పెంచుతున్నారు. పట్టణాల్లో, ఇళ్లలో ప్రజలతో పూల, పండ్ల మొక్కలు నాటించేందుకు కావాల్సిన మొక్కలను ముందుగానే అంచనా రూపొందించి సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి శాశ్వత పట్టణ నర్సరీలను నెలకొల్పారు. నర్సరీలలో నవంబర్ నెల నుంచే మొక్కలను పెంచుతూ వాటికి కావాల్సిన నీడ, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకం కోసం నాణ్యమైన మట్టి, విత్తనాలను తెప్పించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి మొక్కల పెంపకం




చేపడుతున్నారు. పట్టణ నర్సరీల్లో మొక్కలు త్వరగా ఎదిగేందుకు సేంద్రియ ఎరువుల వినియోగం, ఇతర అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవడంతో నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

35 రకాలు సిద్ధం..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయిల్ పట్టణంలోని పట్టణ ప్రగతి నర్సరీల్లో హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు కావాల్సిన అన్ని రకాల మొక్కలను పెంచి సిద్ధంగా ఉ ంచారు. నివాస ప్రాంతాల్లో, ఇళ్లలో ప్రజలతో మొక్కలు నాటిచేందుకు ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పట్టణ నర్సరీలో పెంచుతుండగా అవి సరిపోకపోతే ప్రైవేటు నర్సరీల నుంచి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ నర్సరీల్లో ఏడాది పాటు ప్రజలకు మొక్కలు అందుబాటులో ఉండేందుకు పూలు, పండ్ల, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. గులాబీ, మల్లెపువ్వు, మందార, గోరింటా, చామంతి, తులసి, పారిజాతం, చామంతి, కోనోకార్పస్, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, వాటర్ ఆపిల్, కానుగ, బాదాం, మారేడు, ఎర్రచందనం, శ్రీగంధం, బాహినియా, కదంబం, సెల్టోఫాం, టేకొమా, టేకు, స్పాథొడియా, నెమలినార, నీలగిరి ఇలా సుమారు 35 రకాల మొక్కలను పెంచారు.

వర్షాకాలం ఆరంభంలోనే..

– బట్టు తిరుపతి, కమిషనర్‌మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి నర్సరీలో ఏడాది పాటు మొక్కలు పెంచుతున్నాం. నర్సరీలో మొక్కలు పెంచడంతో అవిఏపుగా పెరిగే వరకు ఉంచి 6 అడుగుల వరకు పెరిగిన మొక్కలను నాటడంతో తొందరగా నాటుకుని ఎదుగుతాయి. ప్రస్తుతం పట్టణ నర్సరీలో నాణ్యమైన మొక్కలు లక్ష వరకు అందుబాటులోకి వచ్చాయి. వర్షాకాలం ఆరంభంలో మొక్కలను నాటించేందుకు చర్యలు తీసుకుంటాం.

# పల్లెప్రగతి పనులెలా ఉన్నాయ

పెద్దపల్లి : స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గత ప్రభుత్వం ఊరికో పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలను ఏర్పాటు చేసింది. వీటిని పల్లె ప్రగతిలో ప్రాధాన్య పనులుగా గుర్తించి ఉపాధిహామీ నిధులను అనుసంధానించారు. దాదాపు మూడేళ్ల కిందట యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టారు. అయితే రూ.కోట్లు వెచ్చించినా ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు. చాలా చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు వినియోగానికి దూరంగా ఉ న్నాయి. ఈ క్రమంలో పల్లె ప్రగతి పనుల వాస్తవ పరిస్థితిని నివేదించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు మౌఖిక ఆదేశాలందాయి. వారు క్షేత్ర స్థాయికి వెళ్లి ఆరా తీస్తున్నారు.

సమగ్ర వివరాల సేకరణ

గ్రామాల్లో కార్యదర్శులు, ఎంపీవోలు క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. శ్మశానవాటికలో నీరు, విద్యుత్తు వసతులు ఉన్నాయా? మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయా? పల్లె ప్రకృతివనాల్లో నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయి? నీటి తడులు అందిస్తున్నారా? నిర్వహణ ఎలా ఉంది? క్రీడా మైదానాల్లో సామగ్రి పంపిణీ చేశారా? మైదానంలో గడ్డి, హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకం ఎలా ఉంది? విత్తనాలు నాటారా? ఎన్ని మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు? నీటి తడులు అందిస్తున్నారా? సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్త సేకరణ ఎలా ఉంది? వేర్వేరుగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారా? ఎంత ఆదాయం సమకూరింది? తదితర అంశాలతో వివరాలు సేకరిస్తున్నారు.

మనుగడలోకి వస్తేనే ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో శ్మశాన వాటికలు, క్రీడా మైదానాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు ఏర్పాటు చేయగా నర్సరీలు తప్ప మిగిలినవి ఎక్కడా మనుగడలో లేవు. ఉమ్మడి జిల్లాలో 1,200 సెగ్రిగేషన్ షెడ్లు, 1,172 డంపింగ్ యార్డులు, 1,314 నర్సరీలు, 1,185 క్రీడా ప్రాంగణాలు, 1,214 పల్లె ప్రకృతివనాలు ఉన్నాయి. అధికారులు వివరాలు సేకరించిన అనంతరమైనా వాటిని మనుగడలోకి తీసుకొస్తే ప్రయోజనం ఉంటుంది.

ఆర్భాటమే తప్ప ఆచరణ ఏదీ!పల్లెల్లో పచ్చదనం పెంచి ఆహ్లాద వాతావరణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. అలాగే అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తీర్చేందుకు వైకుంఠధామం పేరిట సామూహిక శ్మశానవాటికలు నిర్మించారు. పంచాయతీల ఆధ్వర్యంలో సేకరించే చెత్తను తడి, పొడిగా వర్గీకరించి సేంద్రియ ఎరువు తయారీ కోసం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. గ్రామీణుల్లో క్రీడా నైపుణ్యం పెంచేందుకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కాగా శ్మశానవాటికలకు నీటి సౌకర్యం లేక వెలవెలబోతున్నాయి. చెరువు శిఖాలు, ఇరుకు స్థలాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్ షెడ్లదీ ఇదే పరిస్థితి. అట్టహాసంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. పనులు పూర్తి చేశామని చెప్పుకోవడం తప్ప ప్రజలకు అందుబాటులోకి వచ్చాయా? లేదా? అన్నది పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.




బెంగళూరు రేవ్ పార్టీ కేసులో టాలీవుడ్ ప్రముఖ నటి హేమ అడ్డంగా బుక్ అయ్యారు. ఈ కేసులో తమ విచారణకు హాజరుకావాలని ఆమెకు బెంగళూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని.. ఈ నేపథ్యంలో తనకు కొంత గడువు కావాలని ఆమె బెంగళూరు పోలీసులను కోరారు. కానీ వెంటనే విచారణకు హాజరుకావాలని హేమకు మరో నోటీసు జారీ చేసేందుకు బెంగళూరు పోలీసులు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ప్రముఖ నటి హేమ రేవ్ పార్టీలో పాల్గొన్నారంటూ అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. దీంతో ఆ వార్తలను ఖండిస్తూ.. ఆమె వెంటనే ఓ వీడియోను విడుదల చేశారు. తాను ఏ రేవ్ పార్టీకి వెళ్లలేదని.. తాను హైదరాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో ఉన్నానంటూ.. ఆ వీడియోలో హేమ క్లియర్ కట్‌గా స్పష్టం చేశారు. అనంతరం బెంగళూరు పోలీసులు హేమ ఫొటోను సైతం విడుదల చేశారు. దీంతో రేవ్ పార్టీలో పాల్గొన లేదంటు ఆమె చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తెలింది. ఇక ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న హేమ.. కృష్ణవేణి పేరుతో హాజరైనట్లు తెలుస్తుంది. హేమ అసలు పేరు కృష్ణవేణి.

## తెలంగాణలోకి కొత్త 'బీర్లు'.. ప్రభుత్వ అనుమతి పొందిన సోమ్ డిస్టిలరీస్

హైదరాబాద్ : రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడినట్లు వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మద్యం దుకాణాల్లో బీర్లను అందుబాటులో ఉంచాలని పలువురు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసిన వార్తలను కూడా చేశాం. అయినా కూడా బీర్లు అందుబాటులో లేవు. అయితే తెలంగాణలోకి కొత్త బీర్లు రాబోతున్నారు. రాష్ట్రంలో తమ బీర్ బ్రాండ్‌లను సరఫరా చేయడానికి సోమ్ డిస్టిలరీస్ అనుమతి పొందింది. ఇక పవర్ 1000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణలో రూ. 5000 కోట్ల లిక్కర్ స్కాం జరిగినట్లు వార్తలు వచ్చాయి. గత రెండు, మూడు నెలలుగా బీర్లు దొరకకపోవడం వెనుక భారీ కుట్ర జరుగుతున్నట్లు పలు మీడియా సంస్థలు చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. కమీషన్ బట్టి తెలంగాణలో కొత్త బ్రాండ్లకు గేట్లు తెరిచే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని ప్రముఖ బ్రాండ్లు కనుమరుగై కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశ ఉందని రాసుకొచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే




మద్యం కొరత సృష్టించారు. ఇది సాకుగా చూపుతూ కొన్ని కొత్త బ్రాండ్లను పరిచయం చేసేందుకు, వాటి ద్వారా భారీగా కమీషన్ పొందేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసినట్లు సమాచారం.

## వేములవాడ రాజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



వేములవాడ గ్రామీణం: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధి పుణ్యక్షేత్రం వేములవాడకు భక్తులు పోటెత్తారు. శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం సోమవారం వేకువజాము నుంచే భారీగా తరలివచ్చారు. తెలంగాణలోని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది భక్తులు చేరుకున్నారు. రాజన్న దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.
కోడె మొక్కుల కోసం క్యూలైన్‌లో భారీగా భక్తులు వేచి ఉన్నారు. ఆలయ ఈవో రామకృష్ణ, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బలహీన పడిన 'రెమాల్'.. ఊపిరి పీల్చుకున్న బెంగాల్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'రెమాల్' తుపాను బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో తీరం దాటిన తర్వాత విధ్వంసం సృష్టించింది. తీరం దాటే సమయంలో తుపాను దాటికి బెంగాల్ వణికిపోయింది. 135 కి.మీ వేగంతో వీచిన బలమైన గాలులకు వందల సంఖ్యలో వృక్షాలు నేలకొరిగాయి. సాధారణ రైలు, మెట్రో రైలు సర్వీసులతోపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోల్‌కతాలో అనేక చోట్ల నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి తుపాను బలహీన పడినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్ర, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిర్వహణ దళాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి ముందస్తుగా సుమారు లక్షకుపైగా మందిని సురక్షిత ప్రాంతాలకు అధిరారులు తరలించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో తీర రాష్ట్రం ఊపిరి పీల్చుకున్నట్లయ్యింది. నిలిపివేసిన విమాన సర్వీసులు.. 21 గంటల తర్వాత తిరిగి ప్రారంభమయ్యాయి. పట్టాలపై నీరు నిలిచిపోవడంతో పలు మార్గాల్లో మెట్రో సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. రెస్క్యూ బృందాలు సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. గతంలో విధ్వంసం సృష్టించిన అంపన్ తుపానుతో పోలిస్తే రెమాల్ ప్రభావం తక్కువేనని కోల్‌కతా మేయర్ ఫర్హాద్ హకీమ్ వెల్లడించారు. కూలిన వృక్షాల తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. సుందర్బన్ ప్రాంతంలోని గోసాబాలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలైనట్లు సమాచారం. అటు బంగ్లాదేశ్ కూడా 8లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



## తెలంగాణ ఉద్యమం ప్రతిబింబించేలా అధికారిక చిహ్నం!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం ఈ చిహ్నాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన నేతృత్వంలోని బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. సుమారు 12 నమూనాలు రూపొందించగా.. వాటిలో ఒకటి సీఎం రేవంత్‌రెడ్డి ఖరారు చేశారు. ఎంపిక చేసిన దానిలో కొన్ని మార్పులు సూచించారు. గత చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణం ఉన్నాయి. అయితే, రాచరికపు ముద్రల బదులుగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం ప్రతిబింబించేలా ఉండాలని సీఎం భావిస్తున్నారు. ఈ మేరకు రూపొందే చిహ్నాన్నే.. జూన్ 2న ఆవిష్కరించనున్నారు. ఇక రాష్ట్ర గీతంగా ఖరారు చేసిన 'జయ జయహే తెలంగాణ'కు తుది మెరుగులు దాదాపు పూర్తయ్యాయి. సీఎం సూచనలతో భావం, భావోద్వేగం మారకుండా రెండు నిమిషాల గీతంలో కవి అందెశ్రీ మార్పులు చేశారు. సీఎం రేవంత్, అందెశ్రీ సూచనలకు అనుగుణంగా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్వరకల్పన చేశారు. ఈ గీతాన్ని కూడా జూన్ 2న ఆవిష్కరించనున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి రూపం ఓ కొలిక్కి వస్తున్నట్లు సమాచారం.



## ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్

హైదరాబాద్: తెలంగాణలోని ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఉపఎన్నికలో మొత్తం 49 మంది పోటీలో ఉండగా కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, భారాస అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, భాజపా నేత ప్రేమేందర్ ప్రధానంగా బరిలో నిలిచారు. ఈ ఎన్నికలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 4,63,839 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు 49.53 పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాధాన్యత ఓటు పద్ధతి అయినందున ఈవీఎంలను వినియోగించే అవకాశం లేకపోవడంతో బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో అధికారులు ఇచ్చిన వైలెట్ రంగు పెన్నుతో ప్రాధాన్యతను టిక్ చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎడమచేతి చూపుడువేలుకు సిరా చుక్క పెట్టినందువల్ల ఈ ఎన్నికల్లో ఎడమచేయి మధ్యవేలుకి వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోటాకు ఓటు వేసే అవకాశం లేదు. ఉప ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాలు మూసివేసి పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. సాయంత్రం 4 గంటల వరకు వరుసలో నిలబడిన వారందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. జూన్ 5న పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికలో భారాస అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## డీజీపీని కలిసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. శ్రీధర్ హత్య కేసుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్



హైదరాబాద్: వనపర్తి జిల్లాలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీధర్ రెడ్డి హత్య కేసులో సమగ్ర విచారణ జరపాలని ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హత్య జరిగి రోజులు గడుస్తున్నా పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రవీణ్ ఆరోపించారు. ఇదే అంశంపై ఆయన సోమవారం డీజీపీ రవిగుప్తాని కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. "మంత్రి జూపల్లి కృష్ణారావు మీద ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటి వరకు ఈ కేసులో ఎవ్వరిని అరెస్ట్ చెయ్యలేదు. ప్రధాన నిందితుడు జూపల్లి ఇంట్లోనే ఉన్నాడు. శ్రీధర్ రెడ్డి హత్యను ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలి. వారం రోజుల్లో ఈ కేసులో న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం" అని ప్రవీణ్ కుమార్ అన్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌పై..** ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాపింగ్ అంశంపై కూడా మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ దేశ భద్రతకు సంబంధించినదని.. స్వార్థ ప్రయోజనాల కోసం తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ట్యాపింగ్ వెనక ఎవరున్నా సమగ్ర దర్యాప్తు జరపాలని, నిందితులకు శిక్షలు పడేలా చేయాలని కోరారు.

## వారణాసిలో తెలంగాణ బీజేపీ నేతల ప్రచారం

వారణాసి, మే 27: వారణాసి లోక్‌సభ అభ్యర్థిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల బరిలో దిగారు. ఆ క్రమంలో ఆయనకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు తెలంగాణలోని బీజేపీ కీలక నేతలు వారణాసి బాట పట్టారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్ వారణాసి చేరుకున్నారు. మరోవైపు ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్.. ఇప్పటికే వారణాసిలో తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక ఏపీలోని బీజేపీ అగ్రనేతలు జీవీఎల్ నరసింహారావు, భాను ప్రకాశ్ రెడ్డి, హర్షవర్ధన్ తదితరులు వారణాసిలో మోదీకి మద్దతుగా ప్రచారం చేపట్టారు. అయితే వారణాసిలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. మోదీ గెలుపులో వారి ఓట్లు కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకకు చెందిన కీలక నేతలంతా వారణాసికి చేరుకుని.. మోదీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక వారణాసిలో తుది దశ పోలింగ్.. అంటే జూన్



1వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి మోదీని గెలిపించేందుకు కమలనాథులు తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఇక మే 14వ తేదీన ప్రధాని మోదీ వారణాసి లోక్‌సభ అభ్యర్థిగా.. ర్యాలీగా వెళ్లి తన నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించిన సంగతి తెలిసిందే.

## రాష్ట్ర హోంమంత్రికి ప్రొటోకాల్ తెలియదా? : హెచ్‌డీ కుమారస్వామి

బెంగళూరు: జనతాదళ్ (సెక్యులర్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు మద్దతిస్తున్నట్లు కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ప్రజ్వల్ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంటే స్వాగతిస్తామన్నారు. అనేక మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన అంశం బయటకు రావడంతో యూరప్‌కు పారిపోయిన హసన్ ఎంపీ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వర మాట్లాడుతూ "రేవణ్ణ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని కోరినప్పటికీ కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేదు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను స్వీకరించిన వెంటనే చర్యలు తీసుకుంటున్నామని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. అయితే, ఈ విషయంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి తమకు ఎటువంటి రాతపూర్వక సమాచారం రాలేదు. "అన్న మాటలపై కుమారస్వామి మండిపడ్డారు. "ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేసి అతడిని భారత్‌కు రప్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వం ఎంఈఏను అభ్యర్థించింది. కానీ పాస్‌పోర్ట్‌ను 24గంటల్లో రద్దు చేయడం సాధ్యం కాదు. దానికి కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. రాష్ట్ర హోం మంత్రికి అసలు ప్రోటోకాల్ తెలుసా లేదా?"అని కుమారస్వామి ప్రశ్నించారు. ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలను లైంగికంగా వేధించినట్లు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదుల మేరకు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేసింది. ఆయన దౌత్య పాస్ పోర్ట్‌ను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660